క్లుప్తంగా

బలగం సినిమా ప్రదర్శన

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి, సీతారాంపురం గ్రామాల్లో శుక్రవారం రాత్రి జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో తన సొంత ఖర్చులతో ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ద్వారా బలగం సినిమాను ప్రదర్శించారు. అర్వపల్లి, సీతారాంపురం గ్రామాల ప్రజలు ఆయా గ్రామాల్లో సినిమా చూసేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

ప్రధాని మోదీ సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కడియం రామచంద్రయ్య

అర్వపల్లి : సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో శనివారం జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభను జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య కోరారు. శుక్రవారం అర్వపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షలతోపాటు పదోతరగతి పరీక్షల నిర్వహణలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఎలాంటి సంబంధం లేని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపడం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మేడబోయిన యాదగిరి, కౌన్సిలర్ సీహెచ్.హన్మంతు యాదవ్, నాగయ్య, మండల అధ్యక్షుడు పగిళ్ల శంకర్, మారపాక రాములు, మండల గిరిజన మోర్చా అధ్యక్షుడు అంగోతు శ్రీనివాస్‌నాయక్, వేముల సత్తయ్య, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



సూర్యాపేటలో మజ్జిగ పంపిణీ చేస్తున్న మిర్యాల వెంకటేశ్వర్లు, తదితరులు

భానుపురి : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త, వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ మిరియాల వెంకటేశ్వర్లు తన మనుమరాలు అన్విక పుట్టినరోజు సందర్భంగా కొత్త బస్టాండ్ చౌరస్తా వద్ద శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మందికి సరిపడా మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యుడు మిరియాల సుధాకర్, రాష్ట్ర ఉత్తమ విశ్రాంత ఉపాధ్యాయుడు, మాజీ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గుండా రమేష్, ఎన్‌ఆర్‌ఐ సీనియర్ సిటిజన్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, రీజియన్ అధికారి రాచకొండ శ్రీనివాస్, సత్యనారాయణ, ఎం.సోమన్న పాల్గొన్నారు.

ఐకేపీ సెంటర్లు ఏర్పాటు చేయాలి

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఐకేపీ సెంటర్లను త్వరగా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పచ్చిపాల వెంకన్న, మామునూరి ఉపేందర్, పశుల అశోక్, కోడి కుమార్, రమేష్, నరేష్, ఎల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నాగారం : మండల కేంద్రానికి చెందిన చిప్పపల్లి శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య శనివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10,000ల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మేడబోయిన యాదగిరి, చిరబోయిన హన్మంతు, అనంతుల సోమేష్, బొబ్బలి భార్గవ్, బండ్లపల్లి నాగయ్య పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

తిరుమలగిరి : మైనర్లు వాహనాలు నడుపరాదని, తల్లిదండ్రులు వీరికి వాహనాలు ఇవ్వకూడదని తిరుమలగిరి ఎస్‌ఐ శివకుమార్ కోరారు. శుక్రవారం తిరుమలగిరిలో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని అన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐ జగన్‌మోహన్‌రెడ్డి, సిబ్బంది రవీందర్, సైదులు తదితరులున్నారు.

పల్లెలకు ప్రకృతి వనాల శోభ



జల్మాలకుంట తండా పల్లె ప్రకృతి వనం



చీదెళ్లలో..



అనంతారంలో..

పెన్‌పహాడ్ : గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుతో పచ్చదనం పెంపొందించాలన్న ప్రభుత్వ లక్ష్యం క్రమ క్రమంగా నెరవేరుతోంది. పెన్‌పహాడ్ మండలంలోని 29 గ్రామపంచాయతీలతోపాటు అనుబంధ గ్రామాల్లో కలుపుకొని మొత్తం 46 పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. అన్నింటికీ విశాలమైన ప్రభుత్వ స్థలాలు గుర్తించి అందులో వివిధ రకాల పండ్లు, శ్రీ గంధం, ఎర్రచందనం, టేకు, ఇప్ప, మర్రి, వెదురు, వేప, రావి చెట్లతో పాటు పలు రకాల మొక్కలు పెంచుతున్నారు. పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కల సంరక్షణపై పంచాయతీ పాలకులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. దీంతో ఎండా కాలంలోనూ పల్లె ప్రకృతి వనాలు కనువిందు చేస్తున్నాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన పార్కుల పచ్చదనం ఇది పల్లెల్లోని ప్రకృతి వనాల్లో ఉట్టిపడుతోంది. పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుతో గ్రామాలకు పచ్చని ప్రకృతి శోభ సంతరించుకుంటుంది. పల్లె ప్రకృతి వనాల్లోని చెట్లను చూసి ప్రజలు మురిసిపోతూ ఆహ్లాదాన్ని ఆస్వాదిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మాత్రం పల్లె ప్రకృతి వనాల నిర్వహణ సరిగాలేక కళావిహీనంగా ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రకృతి వనాల్లోనూ ప్రత్యేక సంరక్షణ చర్యలు చేపట్టి మొక్కలను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛమైన వాతావరణం కోసమే..



గ్రామాల్లో స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించడం కోసమే ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. ఈ వనాల ద్వారా గ్రామాలు నూతన శోభను సంతరించుకుంటున్నాయి. ఎండకాలంలోనూ మొక్కలను సంరక్షించడంతో పచ్చదనం కళకళలాడుతూ ప్రకృతి వనాలు కనువిందు చేస్తున్నాయి.

\- బాణాల శ్రీనివాస్, ఎంపీడీఓ

సంక్షేమ పథకాలే గెలుపునకు నాంది

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

నూతనకల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపునకు నాంది అవుతాయని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాలని, పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గంలో నూటికి 90శాతం అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని, మిగతా కార్యక్రమాలను త్వరితగతిన పూర్తిచేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా తెలంగాణ సంస్కృతిలో భాగమైన బోనాలు, బతుకమ్మలు, పీరీలు, గొల్లకుర్మల డప్పువాయిద్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యడవెల్లి, మిర్యాల గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి సభ్యులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్ రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, బత్తుల సాయిలుగౌడ్, కొంపెల్లి రాంరెడ్డి, పన్నాల సైదిరెడ్డి, గాజుల తిర్మల్‌రావు, గుగులోతు సురేందర్‌నాయక్ పాల్గొన్నారు.

తీసుకున్న సొమ్ము చెల్లించాలి

తుంగతుర్తి : రావులపల్లి గ్రామంలో మహిళా సంఘం బంధం సభ్యులు చెల్లించిన స్త్రీనిధి డబ్బులను సీసీ ఇద్దయ్య తన అవసరాల నిమిత్తం వాడుకొని ఇప్పటి వరకు చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడని గ్రామ వీఓఏ గుండగాల కృష్ణయ్య ఆరోపించారు. శుక్రవారం రావులపల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్త్రీనిధి డబ్బుల నుంచి సీసీ కొమ్ము ఇద్దయ్య రూ.1లక్ష తీసుకొని తిరిగి చెల్లించడంలేదని.. అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడని అన్నారు.

సూర్యాపేటకు మరో వరం 'న్యాక్'



సీఎం కేసీఆర్, మంత్రులు జగదీశ్‌రెడ్డి, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సూర్యాపేట : మంత్రి గుటకండ్ల జగదీశ్‌రెడ్డి చొరవతో సూర్యాపేటలో న్యాక్(భవన నిర్మాణ రంగంలో మెళకువలకై జాతీయ శిక్షణ కేంద్రం) ఏర్పాటు కావడం పేటకు మరో వరమని మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్ అన్నారు. జిల్లా కేంద్రంలో రూ.పది కోట్లతో జాతీయ వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద భానుపురి భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కుర్ర నర్సయ్య, జనరల్ సెక్రటరీ బొమ్మగాని వెంకన్న, ఉపాధ్యక్షుడు ఇరుగుదిండ్ల అంజయ్య, బొల్లికొండ వీరస్వామి, నిమ్మల వెంకన్న, రఫి, పేరాల వెంకన్న, గ్యార విజయ, ప్రేమ్ కుమార్, రామ్‌రెడ్డి, గోవర్దన్, దాసరి నగేష్, మల్లేష్, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డికి బీటీమ్‌గా సంకినేని



మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

భానుపురి : సూర్యాపేట నియోజకవర్గంలో బీజేపీ నాయకుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు బీఆర్‌ఎస్‌కు బీ టీమ్‌గా వ్యవహరించి మంత్రి జగదీశ్‌రెడ్డి గెలుపునకు సహకరిస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా హాథ్ సే హాథ్ జోడో యాత్రను నిర్వహించి రాహుల్‌గాంధీ సందేశాన్ని ఇంటింటికీ చేరవేశామని తెలిపారు. ఈ పాదయాత్రకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారన్నారు. బీజేపీ నాయకుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు కాంగ్రెస్‌పై నిరాధార ఆరోపణలు చేశారని, దొంగే దొంగ దొంగ అన్నట్లు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గట్టు శ్రీనివాస్, షఫీఉల్లా, గోదల రంగారెడ్డి, స్వామినాయుడు, ఫరూక్, పాలవరపు వేణు, బంటు చొక్కయ్యగౌడ్, వల్దాసు దేవేందర్, దొంతిరెడ్డి సైదిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, వెంకన్ననాయక్ పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంకినేని

దురాజ్‌పల్లి : సూర్యాపేట నియోజకవర్గంలో బీజేపీకి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక పార్టీ నాయకులపై, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని, అక్రమ కేసులకు భయపడేది లేదని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి చెందిన ఆటో యూనియన్ నాయకులు సంకినేని సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో సూర్యాపేటలో ఆటోనగర్ నిర్మిస్తానని హామీ ఇచ్చిన మంత్రి నేటికీ నెరవేర్చలేదన్నారు. పేటలో పోలీసులు ఆటోలనే టార్గెట్‌గా కేసులు రాస్తున్నారని, ఆటో కార్మికులను వేధిస్తుంటే మంత్రి పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలకు ముందు మాత్రం ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రగల్భాలు పలుకుతారని విమర్శించారు. పార్టీలో చేరిన వారిలో ధరావత్ లక్కు నాయక్, ధరావత్ రవి, ధరావత్ రమేష్, ధరావత్ రవీందర్, గుగులోత్ రాము, గుగులోత్ లింగ, మంగ్తా నాయక్, ధరావత్ శ్రీను ఉన్నారు.

లేబర్ ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీ



ఇన్సూరెన్స్ కార్డులు పంపిణీ చేస్తున్న సైదులు

తుంగతుర్తి : కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్మికులకు లేబర్ ఇన్సూరెన్స్ కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్మిక సంక్షేమ, బీమా పథకాలు అందేలా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. 18 నుంచి 58 ఏళ్ల వయస్సు కలిగిన స్త్రీ, పురుష కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నియోజకవర్గ బాధ్యుడు గొడిచర్ల సత్యనారాయణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, కటకం వెంకటేశ్వర్లు, మోహన్‌లాల్, నరేష్, వెంకన్న, బద్రునాయక్, సతీష్, సోమేష్, హన్మంతు, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరా?

- గ్రామాల్లో చేతికందే ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- కనీసం రక్షణ గోడలు ఏర్పాటు చేయని అధికారులు
- భయాందోళనలో ప్రజలు



ముకుందాపురంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

మద్దిరాల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని చాలా గ్రామాల్లో రక్షణ వలయాలు లేకుండానే జనావాసాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. దీంతో ఏదో ఒక్క చోట నిత్యం విద్యుత్ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కానీ సంబంధిత అధికారులలో మాత్రం ఎలాంటి చలనం కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో రహదారుల వెంట ఇష్టానుసారంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి ఎలాంటి రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ముకుందాపురం గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఒకే స్తంభానికి చేతికి అందే ఎత్తులో ప్రమాదకరంగా ఏర్పాటు చేశారు. మామిళ్లమడవ గ్రామంలో సీపీఎం భవనం వద్ద మూలమలుపులో, చిన్ననెమిలలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలకు చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లను బిగించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి వాటికి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలిపాం

ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గ్రామాల్లో సింగిల్‌ఫేజ్ నియంత్రికలు మార్చేందుకు అవసరమైన నిధులను గ్రామ పంచాయతీలు భరించాలి. ఈ విషయమై సర్పంచ్‌లకు తెలియజేశాం. వారు స్పందిస్తే మార్చుతాం.

\- ప్రణయ్, విద్యుత్ ఏఈ, నూతనకల్

రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలి

విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి వాటికి రక్షణ కవచాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి వాటి చుట్టూ రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలి.

\- మామునూరి ఉపేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, పోలుమల్ల

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు



సూర్యాపేటలో నిర్మలామాత చర్చి ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు సిలువ ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు



నాగారం : ఫణిగిరి సీఎస్‌ఐ చర్చి ఆధ్వర్యంలో..



చివ్వెంల: ఖాసీంపేటలోని చర్చిలో ప్రార్థనలు..

భానుపురి : సూర్యాపేట పట్టణవ్యాప్తంగా గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నిర్మలామాత చర్చి, గోపాలపురం డబ్ల్యూఎంఈ, బాప్టిస్టు చర్చి, మన్నా, సిల్వోయం తదితర చర్చిల్లో ఏసుక్రీస్తు సిలువ వేయబడిన సందర్భం, జీసస్ బోధనలను స్మరించుకున్నారు. 40 రోజుల పాటు ఉపవాసం ఉన్న క్రైస్తవులు ఈ ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఉపవాస దీక్షను విరమించారు. నిర్మలామాత చర్చి ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు శిలువ వేయబడిన ఘట్టాలకు సంబంధించి వేషధారణలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు బిషప్ డాక్టర్ దుర్గం ప్రభాకర్, పాస్టర్ పౌల్, హోసన్నా, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : నాగారం, ఫణిగిరి, వర్ధమానుకోట, పస్తాల తదితర గ్రామాల్లో క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఫణిగిరి సీఎస్‌ఐ చర్చి ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు సిలువ మోసే కార్యక్రమాన్ని ప్రదర్శించారు. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. వేడుకల్లో సంఘకాపరి రత్నాకర్, సంఘ సభ్యులు ముదిగొండ లాజర్, కర్నే మాణిక్యం, పెరుమళ్ల జాన్ వెస్లీ, నీరుడు జోసెఫ్, యాట భాస్కర్, సుధాకర్, లక్ష్మయ్య, మణికుమార్, కిరణ్, వెంకన్న, ప్రకాశ్, ముదిగొండ కళమ్మ, ధనమ్మ, జయమ్మ, యాదమ్మ, మరియమ్మ, వసంత, మంజుల, శ్వేత, కల్పన, కృప, గీత పరిమళ, క్రైస్తవులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : చీదెళ్ల గ్రామంలోని పెనుయేలు వర్షిప్ సెంటర్‌లో శుక్రవారం గుడ్ ఫ్రైడే ఆరాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ కాపరి పాస్టర్ జేజే సామ్యూల్ సన్ మాట్లాడారు. ఏసుక్రీస్తు శిలువపై పలికిన చివరి ఏడు మాటలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాణిక్యమ్మ, పొలు, లాజరు, సమాధానం, సువార్త, వీరాచారి, పరిమళ, మార్తమ్మ, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : చీదెళ్లలో ప్రార్థనలు..

అర్వపల్లి : ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరుగు సంసోన్ కోరారు. మండల పరిధిలోని అడివెంల, తిమ్మాపురం తదితర గ్రామాల్లోని కవనెంట్ చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలపై వివరించారు. సిలువ మీద తన దేహానికి మేకులు కొడుతున్న వారిని కూడా క్షమించిన మహోన్నత క్షమాగుణ సంపన్నుడు ఏసుక్రీస్తు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు త్యాగాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జేమ్స్, మహేష్, లింగాచారి, నిమ్మల భిక్షమయ్య, ప్రభుదాస్, సోమిరెడ్డి, ప్రభాకర్, సైదులు పాల్గొన్నారు.



అర్వపల్లి : అడివెంల చర్చిలో..



ఆత్మకూర్ (ఎస్) : పాతర్లపహాడ్‌లోని చర్చిలో..



నాగారం : వర్ధమానుకోటలోని చర్చిలో..

వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో 'టీ సేవ్' కాగడాల ప్రదర్శన



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

సూర్యాపేట : వైఎస్సార్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో 'టీ సేవ్' కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ మీదుగా తెలంగాణ తల్లి విగ్రహం వరకు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిట్ట రాంరెడ్డి ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1.91 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ షర్మిల చేసిన పోరాటం ఫలితంగానే తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసిందని అన్నారు. పేపర్ లీకేజీ బాధితులను కఠినంగా శిక్షించాలని, దీనికి సీఎం కేసీఆర్, కేటీఆర్ బాధ్యత వహించాలన్నారు. విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించి, టీఎస్‌పీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బీరెల్లి శ్రీనివాస్ రెడ్డి, తండు భాస్కర్, లొడంగి గంగాధర్ యాదవ్, తాండూరు జనార్దన చారి, సంజీవ, సతీష్, రాంబాబు, సైదా, సాంబశివుడు, పరశురాములు, శాంతి కుమార్, రాంబాబు, శ్రీను, జాని, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సుశీల

తుంగతుర్తి : మండల పరిధిలోని సంగెం గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణ పనులను సర్పంచ్ ఏశమల్ల సుశీల శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడారు. మండల పరిషత్ నిధులు రూ.4లక్షలతో గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎలేజర్, ఉసర్పంచ్ అనిత లింగయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములుగౌడ్, మల్యాల రాములు, రవి, మల్లయ్య, మల్లేష్, నాగిరెడ్డి, సామేలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మునగాల : నూతన గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండలంలో నూతన గ్రామ పంచాయతీలైన కోదండ రామాపురం, నర్సింహాపురం గ్రామాల్లో ఒక్కో గ్రామపంచాయతీకి రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, సర్పంచ్‌లు దేవరకొండ రమేష్, కారింగుల నాగమణి, ఆకుపాముల సొసైటీ చైర్మన్ వల్లపురెడ్డి రామిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు వేమూరి సత్యనారాయణ, కనమర్లపూడి శ్రీనివాస రావు, బొమ్మ చినవెంకన్న పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పట్టాల పంపిణీ..

మండలంలోని కలకోవ గ్రామ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం రూ.రెండు కోట్ల లక్షా అరవై వేల వ్యయంతో నిర్మించిన 40 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు శుక్రవారం ఇంటింటికీ తిరిగి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంపెల్లి సుజాత, ఎంపీటీసీ సభ్యురాలు గన్నా భవాని, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, సుంకర అజయ్‌కుమార్, కందిబండ సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

10న నిరసన దీక్ష

నడిగూడెం : రిటైర్డు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబోయే నిరసన దీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎండీ.ఖలీల్ అహ్మద్ కోరారు. శుక్రవారం నడిగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆ సంఘం మండల కార్యదర్శి దున్నా అంజయ్య, కోశాధికారి ఎండీ.ఇబ్రహీం పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని శిక్షించాలి

మోతె : పదవ తరగతి పరీక్ష పేపర్ లీకేజీలో నిందితుడిగా ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని విభళాపురం గ్రామంలో నిర్వహించిన సీపీఎం గ్రామ శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ములుకూరి గోపాల్‌రెడ్డి, మండల కమిటీ సభ్యుడు గుంటగాని ఏసు, నాగం మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్.లక్ష్మీప్రసన్న, వైద్య సిబ్బంది కళావతి, విజయ్‌కుమార్, శ్రీదేవి, శైలజ, మహేష్, మంజుల, రాధ, మంగ, గీత, మహేశ్వరి, పద్మావతి, జ్యోతి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాగితరామచంద్రాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న, వైద్య సిబ్బంది